## క్లుప్తంగా

### 10 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక



మాజీ ఎంపీపీ ప్రదీప్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి చేరిన టీడీపీ నాయకులు

**గార్లదిన్నె:** మండలంలోని కల్లూరులో 10 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరాయి. సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ ఎంపీపీ ప్రదీప్‌రెడ్డి ఆధ్వర్యంలో బోయ నారప్ప, రామాంజనేయులు, సుధాకర్, శేఖర్, హనుమంతు, కేశవ, పరుశ రాముడు, సూరికి పార్టీ కండువాలు కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు,అభివృద్ధి పనులు చూసి ఆకర్షితులమై వైఎస్సార్‌సీపీలో చేరామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బృందావన్ రామాంజనేయులు, మాబు, రవికుమార్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### వైఎస్సార్‌సీపీకి ఓటు వేయండి

**తాడిపత్రిరూరల్:** సంక్షేమానికి పెద్దపీట వేసిన వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి కోరారు. పట్టణంలోని 29వ వార్డులో సోమవారం ఆయన ప్రచారం నిర్వహించారు. అదేవిధంగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎమ్మెల్యే పెద్దారెడ్డికి ఓటు వేసి గెలిపించాలని దళిత క్రిస్టియన్ నాయకుడు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ వైఎం జాన్సన్ ప్రచారం నిర్వహించారు. అలాగే పట్టణంలోని ఏటిగడ్డపాలెంలో సోమవారం మైనార్టీ నాయకులు జిలాన్‌బాషా, జాకీర్, అయాబ్‌బాషా తదితరులు ప్రచారం చేశారు.

### వీరా గెలవాలని పాదయాత్ర



నసనకోటకు పాదయాత్రగా వెళ్తున్న యువకులు

**బుక్కరాయసముద్రం:** శింగనమల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు గెలవాలని చెదుల్ల గ్రామానికి చెందిన వ్యక్తులు నసన కోట ముత్యాలమ్మ దేవాలయానికి పాదయాత్రగా వెళ్లారు. చెదుల్ల గ్రామానికి చెందిన శేషు, గోపాల్, నాగలింగ, నారాయణస్వామి, ఎర్రినాగప్ప, అంజి, రామాంజి, గోవర్ధన్, కుమార్ పాదయాత్రను వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆలూరి రమణారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ సీఎం జగన్ నాయకత్వంలో వీరాంజనేయులును ఎమ్మెల్యేగా చూడలన్నదే మా కోరిక అన్నారు.

### శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

**గార్లదిన్నె/పెద్దపప్పూరు/పెద్దవడుగూరు:** ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ పేర్కొన్నారు. సోమవా రం మండల కేంద్రం గార్లదిన్నె ఇందిరమ్మకాలనీ, సంజీవపురం, యర్రగుంట్లలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. అలాగే పెద్దపప్పూరు మండలంలోని ముచ్చుకోట, వరదాయపల్లి, నరసాపురం, చీమలవాగుపల్లి, పసలూరు,పెద్దపప్పూరులో యాడికి సీఐ రోషన్, ఎస్‌ఐ శరత్ చంద్ర నేతృత్వంలో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. అలాగే పెద్దవడుగూరు మండలంలోని చిట్టూరులో కేంద్రసాయుధ బలగాలతో యాడికి సర్కిల్ సీఐ రోషన్, ఎస్‌ఐ శ్రీనివాసులు కవాతు నిర్వహించారు.


### ఫ్యాన్ గుర్తుకు ఓటేయండి



ప్రచారం చేస్తున్న భాస్కర్‌రెడ్డి

**పెద్దపప్పూరు:** ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎంపీగా శంకర్ నారాయణ, ఎమ్మెల్యేగా కేతిరెడ్డి పెద్దారెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలుపొందించాలని తాడిపత్రిలోని సీవీ రామన్ విద్యాసంస్థల చైర్మన్ బిందెల భాస్కర్‌రెడ్డి కోరారు. సోమవారం ఆయన చిన్నపప్పూరు, రామకోటి కాలనీల్లో ప్రచారం చేశారు. సంక్షేమ సారథి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకుందామని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో స్థానిక నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఎన్నికల పరిశీలకుడిగా రాజగోపాల్



**తాడిపత్రి:** తాడిపత్రి అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎన్నికల పరిశీలకుడిగా మలికిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని ఆ పార్టీ కేంద్ర కార్యాలయం నియమించింది. ఈ మేరకు కేంద్ర పార్టీ కార్యాలయం సోమవారం ఆయన నియామకంపై ఓ లేఖను విడుదల చేసింది. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నంద్యాల జిల్లాకు చెందిన మలికిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని తాడిపత్రి అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడిగా నియమించారు.

# సంక్షేమ ప్రభుత్వానికి పట్టం కట్టండి



మహిళను ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

**తాడిపత్రిరూరల్:** ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి సంక్షేమ ప్రభుత్వానికి పట్టం కట్టాలని ఎమ్మెల్యే పెద్దారెడ్డి కోరారు. పట్టణంలోని టైలర్స్ కాలనీలో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అభివృద్ధి సాధ్యమన్నారు. టీడీపీ నాయకులు ఎన్నికల్లో గెలుపొందడానికి మాయ మాటలతో నమ్మించే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. వారి మాటలకు మోసపోకుండా అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓటు వేయాలని తెలిపారు. గతంలో టీడీపీ నాయకులు చేసిన అక్రమాలు, దౌర్జన్యాల వల్ల తాడిపత్రిలో అశాంతి వాతావరణం ఉండేదన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే వాటికి చమర గీతం పాడానన్నారు. ప్రస్తుతం శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయంటే తాను తీసుకున్న చర్యలేనని ప్రజలకు వివరించారు. మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులకు ఓటు వేసి మోసపోయారని, సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి చేసిన తప్పును సరిదిద్దుకోవాలని ప్రజలను కోరారు.

**ప్రచారంలో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు**

తాడిపత్రి పట్టణంలోని సుంకుళమ్మ పాలెంలో ఎమ్మెల్యే సతీమణి రమాదేవి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే పెద్దారెడ్డిని మరోసారి గెలిపించాలని కోరారు. అలాగే పట్టణంలోని పీర్లమాన్యంలో హర్షవర్ధన్‌రెడ్డి పర్యటించారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని కోరారు. పుట్లూరు రోడ్డులో నిర్వహించిన ప్రచారంలో ఎమ్మెల్యే కోడలు అర్చితారెడ్డి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలు ముఖ్యమంత్రి జగన్‌తోనే సాధ్యమన్నారు.

### జేసీకి మతిభ్రమించి మాట్లాడుతున్నారు

**తాడిపత్రి రూరల్:** తాడిపత్రి పట్టణంలో ఆదివారం నిర్వహించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జైత్రయాత్రకు వచ్చిన జన ప్రవాహాన్ని చూసి జేసీ ప్రభాకర్‌రెడ్డి మతిభ్రమించి మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే పెద్దారెడ్డి మండిపడ్డారు. సోమవారం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఊహించని స్థాయిలో వచ్చిన జనాలను చూసి జేసీ జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. వైఎస్సార్ సర్కిల్‌లో జైత్రయాత్ర సభను పురస్కరించుకుని అధికారులు అక్కడున్న షెడ్లను తాత్కాలికంగా తొలగించి తిరిగి బిగించారన్నారు. గతంలో జేసీ ప్రభాకర్‌రెడ్డి రేకుల షెడ్లల్లో ఉన్న వారిని బలవంతంగా పంపించే ప్రయత్నాలు చేశాడన్నారు. వారందరూ భయంతో తన వద్దకు వస్తే తాను హామీ ఇచ్చి పంపానన్న విషయం టీ స్టాల్, అల్పాహారం చిరు వ్యాపారులను అడిగితే తెలుస్తుందన్నారు. పట్టణంలో చిరు వ్యాపారులు, సినిమా థియేటర్ యజమానులు, టీస్టాల్ వ్యాపారులను జేసీ భయపడించిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఎన్నిలకకు ముందే కుమారుడు ఓడిపోతున్నాడన్న భయంతోనే ఆయన ఇలా మాట్లాడుతున్నాడన్నారు.



ఓటు అడుగుతున్న ఎమ్మెల్యే సతీమణి రమాదేవి



ఓటు అభ్యర్థిస్తున్న కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి



ప్రచారంలో ఎమ్మెల్యే కోడలు అర్చితారెడ్డి

# మంచి చేసే జగనన్నకే ఓటు వేద్దాం



పప్పూరులో మహిళలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న వీరాంజనేయులు

- మేనిఫెస్టోతో అన్ని వర్గాలకూ మేలు
- ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.వీరాంజనేయులు

**నార్పల:** కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి మంచి చేసే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని శింగనమల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.వీరాంజనేయులు కోరారు. సోమవారం ఆయన మండలంలోని బొమ్మకుంటపల్లి, బి.పప్పూరు, మంగపట్నం, సోదనపల్లి, గుంజేపల్లి, నలపరెడ్డిపల్లిలో నిర్వహించిన మన ఊరికి మన వీరా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన ఆయా గ్రామాలకు చేరుకోగానే గ్రామస్తులు బాణసంచా పేలుస్తూ డప్పు, వాయిద్యాల నడుమ ఘనస్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రకటించిన మేనిఫెస్టో అన్ని వర్గాలకూ ఆమోదయోగ్యంగా ఉందన్నారు. 2019 మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత జగనన్నదేనన్నారు. టీడీపీ మాయమాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. తెలుగుదేశం పార్టీ ఓట్ల కోసం నానా తంటాలు పడుతోందన్నారు. టీడీపీ సూపర్ సిక్స్ అబద్ధపు హామీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. 2024లో మరోమారు జగనన్న ప్రభుత్వం వస్తుందని, రాష్ట్రాన్ని మరింత సంక్షేమ, అభివృద్ధి పథంలో జగనన్న నడిపిస్తారన్నారు. ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీని మరోసారి గెలుపించుకుందామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ నిట్టూరు రఘునాథ్‌రెడ్డి, ఎంపీపీ నాగేశ్వరావు, సొసైటీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి, ఎంపీటీసీ పద్మాకర్‌రెడ్డి, సర్పంచులు రాంభూపాల్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, నాయకులు పెద్దిరెడ్డి, రమేష్‌రెడ్డి, రంగారెడ్డి, పెద్దారెడ్డి, కాటమయ్య, కొండారెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



### నేడు 'మన ఊరికి మన వీరా'

**గార్లదిన్నె:** వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మండలంలో మన ఊరికి మన వీరా కార్యక్రమం నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ నరేంద్రరెడ్డి సోమవారం తెలిపారు. మంగళవారం ఉదయం 7.30 కు మర్తాడులో ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు నాయకులు, కార్యకర్తలతో కలసి ప్రచారం చేస్తారన్నారు. రాత్రికి గ్రామంలోనే పల్లెనిద్ర చేస్తారన్నారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

**చిన్నజలాలపురంలో వన భోజనాలు**

**శింగనమల:** మండలంలోని చిన్నజలాలపురంలో సోమవారం గ్రామస్తులు వనభోజనాలకు వెళ్లారు. చిన్న పిల్లలు, వృద్ధులు సహా ఉదయం 6 గంటలకే వంట సామాగ్రిని గంపలో పెట్టుకుని ఊరి బయట ఉన్న చెట్ల కిందకు చేరుకున్నారు. అక్కడే భోజనాలు చేసుకుని, సాయంత్రం తిరిగి ఇళ్లకు వెళ్లారు.

**నివాళి**

**పెద్దపప్పూరు:** మండలంలోని చాగల్లులో సోమవారం తెల్లవారుజామున గుండెపోటుతో వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఆదెన్న (65) మృతి చెందాడు. తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆ గ్రామానికి వెళ్లి ఆదెన్న మృతదేహం వద్ద నివాళులర్పించారు. మృతుడి భార్య సూరమ్మ, కుమార్తెలు, కుమారుడిని పరామర్శించారు.

**నామమాత్రంగా మండల సమావేశం**

**పుట్లూరు:** ఎన్నికల కోడ్‌ను దృష్టిలో ఉంచుకుని సోమవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నామమాత్రంగా నిర్వహించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ బి.రాఘవరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో తాగునీరు, ఉపాధి పథకంపై చర్చించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లికార్జునస్వామి, ఎంపీడీఓ దస్తగిరి, అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

**పోలింగ్ కేంద్రాల పరిశీలన**

**పుట్లూరు:** మండలంలోని కోమటికుంట్ల, గరుగుచింతలపల్లి గ్రామాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను సోమవారం తహసీల్దార్ మల్లికార్జునస్వామి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద వసతులు పరిశీలించారు. అనంతరం ఓటర్ స్లిప్‌ల పంపిణీ కార్యక్రమంపై బీఎల్‌ఓలను ఆరా తీశారు. ఆయన వెంట ఎంపీడీఓ దస్తగిరి, ఎస్‌ఐ హేమాద్రి ఉన్నారు.

**నిబంధనలకు అనుగుణంగా విధులు**

**యాడికి:** ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని, లేకుంటే చర్యలు తప్పవని ఎలక్షన్ అధికారి మనీష్ సింగ్ ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఓటింగ్ శాతం పెరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో తాడిపత్రి డీఎస్పీ గంగయ్య, ఆర్‌ఐ ఆనంద్, బీఎల్వోలు పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

**వాహనాల తనిఖీ**

**గార్లదిన్నె:** మండలంలో పోలీసులు వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. సోమవారం గార్లదిన్నె 44వ జాతీయ రహదారిపై పోలీసులు ప్రతివాహనాన్నీ క్షుణ్ణంగా తనిఖీ చేసి పంపించారు. శింగనమల సీఐ శ్రీధర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీలు వెంట ఉంచుకోవాలన్నారు. వాహనాల్లో డబ్బు ఉంటే, సంబంధిత ఆధారాలను చూపాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మహమ్మద్ గౌస్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

**బుక్కరాయసముద్రం:** అనంతపురం – తాడిపత్రి రహదారిపై బీకేఎస్ పోలీసులు సోమవారం సాయంత్రం వాహనాల తనిఖీ నిర్వహించారు. సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలను పాటించాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

**అర్జాస్ స్టీల్స్ ఔదార్యం**

**అనంతపురం మెడికల్:** సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలోని గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగానికి తాడిపత్రి అర్జాస్ స్టీల్స్ ప్రతినిధులు ఎండోస్కోపి అందజేసి ఔదార్యం చాటుకున్నారు. సోమవారం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో జరిగిన కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు, సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు మాట్లాడారు. రోగుల సహాయార్థం అర్జాస్ స్టీల్స్ పరికరం అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, అర్జాస్ స్టీల్స్ రంజన్ ఠాకూర్, నరేందర్, సెంథిల్ లక్ష్మీనారాయణ, ఆలంబన జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

**పెన్షనర్స్ అసోసియేషన్‌కు విరాళం**

**తాడిపత్రి అర్బన్:** స్థానిక పెన్షనర్స్ భవనంలో అధ్యక్షుడు సత్యప్రసాద్‌కు విశ్రాంత ఉపాధ్యాయుడు జీవీ నారాయణరెడ్డి రూ.10 వేలను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో సభ్యుడు వీరారెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### 'తెలుగు తమ్ముళ్ల' ఓవరాక్షన్

**బుక్కరాయసముద్రం:** అధికారంలో ఉన్నా..లేక పోయినా మేమింతే..మేం ఏం చేసినా అడిగేవారెవరని తెలుగు తమ్ముళ్ల ఓవరాక్షన్‌తో యథేచ్ఛగా ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తున్నారు. మండలంలోని చెన్నంపల్లి మెయిన్ బజార్‌లో టీడీపీ నాయకులు వాటర్ ప్లాంట్‌పై సైకిల్ పెట్టి జెండాలు కట్టారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా తెలుగు తమ్ముళ్ల తీరుపై గ్రామస్తులు మండిపడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

# తాడిపత్రి బరిలో 18 మంది

**తాడిపత్రి:** తాడిపత్రి అసెంబ్లీ స్థానానికి ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు అర్హత సాధించిన 26 మంది అభ్యర్థుల్లో సోమవారం 8 మంది నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో 18 మంది అభ్యర్థులు మాత్రమే పోటీలో మిగిలారు. అందులో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా కేతిరెడ్డి పెద్దారెడ్డి, టీడీపీ అభ్యర్థిగా జేసీ అస్మిత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గుజ్జల నాగిరెడ్డితో పాటు ఎనిమిది మంది ఇతర పార్టీలకు చెందిన అభ్యర్థులు, ఏడుగురు స్వతంత్ర అభ్యర్థులు బరిలో నిలిచారు.

**శింగనమల బరిలో 14 మంది**

**శింగనమల:** శింగనమల నియోజకవర్గానికి నామినేషన్లు వేసిన 16 మందిలో ఇద్దరు నామినేషన్లను విత్‌డ్రా చేసుకోగా, 14 మంది బరిలో ఉన్నట్లు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెన్నెల శ్రీను తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ల విత్‌డ్రాలు జరిగాయి. వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఎం.వీరాంజనేయులు, టీడీపీ అభ్యర్థిగా బండారు శ్రావణి, కాంగ్రెస్ అభ్యర్థిగా సాకే శైలజానాథ్, బీఎస్పీ అభ్యర్థిగా కుందనం గౌతమి, మరో పది మంది బరిలో ఉన్నారు.

# మైనార్టీలకు చంద్రబాబు క్షమాపణ చెప్పాలి

**తాడిపత్రిరూరల్:** మైనార్టీలను తాగుబోతులుగా చిత్రీకరిస్తూ కించపరిచేలా మాట్లాడిన చంద్రబాబు బహిరంగ క్షమాపణ చెప్పాలని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జిలాన్‌బాషా, వక్ఫ్ బోర్డు మాజీ అధ్యక్షుడు జాకీర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నెల్లూరులో ముస్లింలు ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేసినందుకు వారికి చంద్రబాబు ఇచ్చిన కానుక ఇదా? అని దుయ్యబట్టారు. ఎన్డీయే కూటమిలో ఉన్నంత మాత్రాన ప్రధాని మోదీ మెప్పు పొందేందుకు ముస్లింలను కించపరచడం తగదన్నారు. ముస్లింలను తక్కువ చేసి మాట్లాడిన చంద్రబాబుకు ఎన్నికల్లో గట్టి గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు జావేద్, మైనార్టీ సెల్ సెక్రటరీ బాబా, నాయకులు అయూబ్‌బాష తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మైనార్టీ నాయకులు